


## క్రీస్తును వెంబడించిన స్త్రీలు

**మూలవాక్యము: మత్తయి 27 : 55** యేసునకు ఉపచారము చేయుచు గలిలయ నుండి **ఆయనను వెంబడించిన అనేక మంది స్త్రీలు** అక్కడ దూరము నుండి చూచుచుండిరి.

**లూకా 23: 27** గొప్ప జనసమూహమును, ఆయనను గూర్చి రొమ్ముకొట్టుకొనుచు దుఃఖించుచున్న చాలమంది స్త్రీలు ఆయనను వెంబడించిరి.

ఈ సంగతులకు మీరే సాక్షులు అని వాక్యము మనకు ఎన్నో సంగతులను గూర్చి హెచ్చరిస్తుంది. అయితే స్త్రీలు ప్రభువైన యేసు క్రీస్తు వారు సిలువలో పొందిన వేధనకి, మన కోసం ప్రాణం పెట్టిన ఆ వధించ బడిన ఆ గొఱ్ఱె పిల్లకి వారు మౌన ప్రత్యక్ష సాక్షులు. సిలువలో ఎంతో వేధనతో యేసు క్రీస్తు వారు శిక్షను అనుభవిస్తున్నప్పుడు అక్కడ దానికి సాక్ష్యముగా ఉన్నది శిష్యులు కాదు. అప్పుడు అక్కడ సాక్షులుగా ఉన్నది కొంత మంది స్త్రీలే.

యేసు క్రీస్తును అనేకులు వెంబడించిరి. అందులో కొంతమంది శిష్యులుగా ఉండిరి, అయితే క్రీస్తు చివరి దశలో తనను వెంబడించింది ఈ స్త్రీలే. వీరు లోక రక్షకుడైన క్రీస్తు మరణానికి ప్రత్యక్ష సాక్షులు. అంత మాత్రమే కాదు కాని ఆయన చనిపోయిన తరువాత యేసు పార్థీవ దేహన్ని సమాధి చేయడంలో అరిమతయియ యోసేపుతో పాటుగా ఉన్నవారు స్త్రీలే. వీరే పునరుత్థానుడైన క్రీస్తుకి ప్రథమ సాక్షులు.

లోక రక్షకుడైన మెస్సియ సిలువ భారము మోస్తున్నప్పుడు, ఈ స్త్రీలు చూపిన దైవ భక్తి ఎంతో గొప్పది. దీనిని గూర్చి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది. ఎందుకంటే చాలా మంది యూదులు ప్రభువైన యేసు క్రీస్తు వారు చేసిన అద్భుత క్రియలకు సాక్షులుగా ఉంటే, వీరు మాత్రము ఆయన వేధనకి, మరణ పునరుత్థాలకి సాక్షులుగా ఉన్నారు.

కేవలం వీరు ఆ విషయాలకి సాక్షులుగా మాత్రమే కాక, వారు తమ ప్రాణాలకు తెగించి వారి స్థాయికి మించి సహాయం అందించడంలో మన ప్రభువునకు ఎంతో ఉపయోగపడ్డారు. అప్పుడు చాలా మంది యూదులు క్రీస్తును అపహించి, దూషించి, ఎగతాళి చేస్తూ కొట్టుకుంటూ కల్వరి గిరికి తీసుకు వెళుతుంటే, అప్పుడు ఎవరైన క్రీస్తుకి మద్దతు తెలిపితే వారు కూడా యూదుల కోపానికి బలి కావలసి వస్తుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా వారు ప్రభువునకు తోడుగా నడిచారు. అది వారి ధైర్యసాహసాలను చూపిస్తుంది.

### ప్రభువు తల్లి మరియ

మేరి మాత మిగిలిన వారితో పోల్చుకుంటే క్రీస్తును వెంబడించిన స్త్రీలులో ఆమె ప్రత్యేకమైన సాక్ష్యము కలిగి ఉంటుంది. ఎందుకంటే మన ప్రభువు, లోక రక్షకుడైన యేసు క్రీస్తువారు ఈ భూలోకంలో బాల యేసుగా కళ్లు తెరచింది మరియ ఒడిలోనే, ఆమె కళ్ల ఎదుటనే. ఆయన గొల్గొత కొండ మీద కళ్ళు మూసింది ఆమె కళ్ల ఎదుటనే. అందుకే ఆమె అందరికంటే ప్రత్యేకము.

ప్రభువైన యేసు క్రీస్తు వారు ఈ లోకంలో పుట్టక మునుపే నిందలు భరించడానికి సిద్ధపడిన వారు, భరించిన వారు ఎవరైనా ఉన్నారంటే వారిలో మరియమ్మ ప్రథమంగా ఉంటుంది.

యవ్వన ప్రాయంలో ఉన్న మరియ యోసేపునకు ప్రధానం చేయబడిన తరువాత దూత ఆమె దగ్గరకి వచ్చి పరిశుద్ధాత్మ వలన నీవు గర్భము ధరించి ఒక కుమారుని కని ఆయన యేసు అను పేరు పెట్టుదువు. పుట్టబోవు శిశువు పరిశుద్ధాత్ముడై దేవుని కుమారుడు అనబడును అని చెప్పినప్పుడు **లూకా 1: 38** అందుకు మరియ– ఇదిగో ప్రభువు దాసురాలను, నీ మాట చొప్పున నాకు జరుగును గాక అనెను.

పెళ్లి కాకుండా గర్భము ధరించడం అంటే ఆమె దేవుని కోసం ఎలాంటి నిందనైనా భరించడానికి ఎంతలా సిద్ధపడి ఉందో అర్ధమౌతుంది. ఇది ఆ వయస్సులో, ఆ స్థితిలో తాను చేయడానికి సిద్ధపడింది అంటే సాహసమే అని చెప్పాలి. అయితే ప్రభువు దూత ఈ విషయం మరియకి చెప్పిన క్షణం నుంచి యేసు క్రీస్తు వారు సిలువలో మరణించిన తరువాత కూడా ఆ తల్లికి గుండె కోతే మిగిలినది. అయినను తాను తన ప్రభువు దాసురాలిగా వీటి నన్నింటిని భరించింది. మరి ప్రియ సహోదరుడా, సహోదరి క్రీస్తు కోసం నువ్వు అన్ని నిందలు భరించడానికి సిద్ధముగా ఉన్నావా? చిన్న కష్టం వస్తే మనం మొదట నిందించేది ప్రభువునే. ఆలోచించు ప్రియ సంఘమా?

**లూకా 1:46 – 55 వరకు మరియ చేసిన అద్భుతమైన ప్రార్ధన ద్వారా మనం తెలుసుకోదగిన కొన్ని మరియ లక్షణాలు:**

1. విశ్వాసము గలిగి తాను ప్రభునకు దాసురాలు అని ఒప్పుకున్నది.
2. దేవుని నామమును ఘనపరచింది.
3. యేసే రక్షకుడని నమ్మింది.
4. దేవుని ద్వారా తాను ధన్యురాలు అయ్యింది అని నమ్మింది.
5. దేవుని పరాక్రమమును ఒప్పుకున్నది.

**యేసును రక్షించుకోవడం కోసం పాటు పడింది.**

**1. లూకా 2:7** తన తొలిచూలు కుమారుని కని, పొత్తిగుడ్డలతో చుట్టి, సత్రములో వారికి స్థలము లేనందున ఆయనను పశువుల తొట్టిలో పరుండబెట్టెను.

2. తన భర్తయైన యోసేపుతో కలిసి యూదుల ధర్మశాస్త్రము ప్రకారము యేసును ప్రభువునకు ప్రతిష్ఠించి, సున్నతి చేయించి, యెరూషలేము మందిరములో దేవునికి బలులు అర్పించింది. (లూకా 2: 22–24)

3. తన కుమారుని దుష్టుడైన హేరోదు నుంచి రక్షించుకొనుటకు దూత తన భర్తయైన యోసేపుతో చెప్పిన ప్రకారము ఐగుప్తునకు పయనించింది. (మత్తయి 2: 13–15).

ఆ తరువాత యేసును ప్రవచన నెరవేర్పు ప్రకారము నజరేయుడైన యేసు అనబడులాగున నజరేతునకు తీసుకు వెళ్లింది. (మత్తయి 2: 23)

4. యేసును వాడుక చొప్పున సమాజ మందిరమునకు తీసుకు వెళ్లేది. (లూకా 4:16)

5. ప్రతి సంవత్సరము యేసును పస్కా పండుగకి యెరూషలేము తీసుకువెళ్లేది. (లూకా 2:41)

6. ప్రభువు అద్భుత క్రియలు చేయగలడని నమ్మి కానా అను ఊరిలో పెళ్లిలో ద్రాక్షారసం అయిపోతే ప్రభువునకు ఆ విషయం తెలియ జేసింది. అద్భుతం కళ్లారా చూచింది. (యోహాను 2: 3)

7. క్రీస్తును సిలువ వరకు వెంబడించింది.

**యోహాను 19:25 ఆయన తల్లియు**, ఆయన తల్లి సహోదరియు. క్లోపా భార్యయైన మరియయు, మగ్దలేనే మరియయు యేసు సిలువయొద్ద నిలుచుండిరి.

చూశాము కదా మరియలో ఉన్న కొన్ని గొప్ప లక్షణాలు. మరి మనం మన పిల్లల విషయంలో అలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నామా?

మందిరానికి తీసుకు వెళ్లే విషయంలో కావొచ్చు, క్రమాలు నేర్పించే విషయంలో కావొచ్చు, శత్రువు నుంచి బిడ్డలను రక్షించుకొనే విషయంలో కావొచ్చు.. మనం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నాము. యేసు తన బాల్యంలోనే కాదు

(లూకా 2:51), తన తుది శ్వాస వరకు తన తల్లిదండ్రులకు విధేయుడై ఉన్నట్లు లేఖనాలు ద్వారా తెలుస్తుంది. అందుకు ప్రభువైన యేసు తాను సిలువ మరణం పొందేటప్పుడు తన తల్లి బాధ్యతను తన ప్రియమైన శిష్యునకి అప్పగించెను. **యోహాను 19: 26** యేసు తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి అమ్మా, యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను.

పై వివరణ ద్వారా

1. దేవుని విషయంలో మరియ గొప్ప త్యాగము, ధైర్యము చూపించింది అని అర్థమౌతుంది.
2. ఆమె గొప్ప తల్లి అని అర్థమైతుంది.
3. వాక్యాను సారముగా నడచిన స్త్రీ అని అర్థమౌతుంది.
4. చివరగా యేసు ఆరోహణం అయిన తర్వాత తాను మందిరములో యేసు తల్లిగా కాక యేసు దాసురాలిగా, శిష్యురాలుగా జీవించినట్టు అ. కా 1: 14 తెలియజేస్తుంది.

**అ.కా 1:14** (మేడ గదిలో) వీరందరును, వారితో కూడా కొందరు స్త్రీలును, యేసు తల్లియైన మరియయు ఆయన సహోదరులును ఏక మనస్సుతో ఎడతెగక ప్రార్థన చేయుచుండిరి.

అందుకే మరియ పేరు యేసు క్రీస్తు వంశావళిలో చిరస్థాయిగా నిలిచిపోయింది. **మత్తయి 1:16** యాకోబు మరియ భర్తయైన యోసేపును కనెను. **ఆమె యందు క్రీస్తు అనబడిన యేసు పుట్టెను.**

## <u>మగ్దలేనే మరియ</u>

**1. 7 దెయ్యముల వలన బాధించబడుతున్న తాను క్రీస్తు ద్వారా విడుదల పొందింది. మార్కు 16: 9**
ఆదివారము తెల్లవారినప్పుడు యేసులేచి, తాను ఏడు దయ్యములను వెళ్లగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను. (లూకా 8:2 లో కూడా ఈ మాటను చూడవచ్చును.)

**2. యేసునకు ఉపచారము చేయుచూ క్రీస్తును వెంబడించింది. మత్తయి 27:55, 56 యేసునకు ఉపచారము చేయుచు** గలిలయ నుండి **ఆయనను వెంబడించిన** అనేక మంది స్త్రీలు అక్కడ దూరము నుండి చూచుచుండిరి.
56 వారిలో **మగ్దలేనే మరియయు,** యాకోబు యోసే అనువారి తల్లియైన మరియయు, జెబదయి కుమారుల తల్లియు ఉండిరి.

**3. ప్రభువు సిలువ మరణానికి, ఆయన సమాధికి సాక్షి:**

**మార్కు 15: 37 - 40** అంతట **యేసు** గొప్ప **కేకవేసి ప్రాణము విడిచెను.**
38 అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను.
39 ఆయన కెదురుగా నిలిచియున్న శతాధిపతి ఆయన ఈలాగు ప్రాణము విడుచుట చూచి, నిజముగా ఈ మనుష్యుడు దేవుని కుమారుడే అని చెప్పెను. కొందరు స్త్రీలు దూరము నుండి చూచుచుండిరి.
40 వారిలో **మగ్దలేనే మరియయు, చిన్న యాకోబు యోసే అనువారి తల్లియైన మరియయు, సలోమేయు ఉండిరి.**
యోహాను 19:25 లో కూడా ఈ మాటను చూడవచ్చును. **యోహాను 19:25** ఆయన తల్లియు, ఆయన తల్లి సహోదరియు. క్లోపా భార్యయైన మరియయు, **మగ్దలేనే మరియయు** యేసు సిలువయొద్ద నిలుచుండిరి.
**మత్తయి 27: 61** మగ్దలేనే మరియయు, వేరొక మరియయు, **అక్కడనే సమాధికి ఎదురుగా కూర్చుండి** యుండిరి.

**4. ఆదివారము తెల్లవారుచుండగా సమాధినొద్దకు వెళ్లిన వారిలో మగ్దలేనే మరియ ఒకరు.**

**మత్తయి 28:1** విశ్రాంతి దినము గడచిపోయిన తరువాత ఆదివారమున, తెల్లవారుచుండగా మగ్దలేనే మరియయు, వేరొక మరియయు సమాధిని చూడవచ్చిరి.

**యోహాను 20:1** ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్దలేనే మరియ పెందలకడ సమాధి యొద్దకు వచ్చి, సమాధి మీద ఉండిన రాయి తీయబడియుండుట చూచెను. (మార్కు 16:1 లో కూడా ఈ మాటను చూడవచ్చును.)

**5.ప్రభువు కొరకు సుగంధ ద్రవ్యములు కొన్నవారిలో ఒకరు:**

**మార్కు 16: 1** విశ్రాంతి దినము గడచిపోగానే మగ్దలేనే మరియయు యాకోబు తల్లియైన మరియయు, సలోమేయు వచ్చి, ఆయనకు పూయవలెనని సుగంధ ద్రవ్యములు కొనిరి.

**6. ఖాళీ సమాధిని చూచి, ప్రభువు సమాధిలో లేడని ఎవరో ఎత్తుకొని పోయిరి అని చింతించింది, శిష్యులకు సమాచారం అందించింది.**

**యోహాను 20: 2** గనుక ఆమె పరుగెత్తుకొని సీమోను పేతురునొద్దకును, యేసు ప్రేమించిన ఆ మరియొక శిష్యుని యొద్దకును వచ్చి ప్రభువును సమాధిలో నుండి యెత్తుకొని పోయిరి, ఆయనను ఎక్కడ ఉంచిరో యెరుగమని చెప్పెను.

**యోహాను 20:11** అయితే మరియ (మగ్దలేనే) సమాధి బయట నిలిచి యేడ్చుచుండెను. ఆమె ఏడ్చుచు సమాధిలో వంగి చూడగా...

**7. దేవదూతలను చూచింది, వారితో మాట్లాడింది:**

**యోహాను 20: 12, 13** తెల్లని వస్త్రములు ధరించిన యిద్దరు దేవదూతలు యేసు దేహము ఉంచబడిన స్థలములో తలవైపున ఒకడును, కాళ్లవైపున ఒకడును కూర్చుండుట కనబడెను.
వారు అమ్మా, యెందుకు ఏడ్చుచున్నావని ఆమెను అడుగగా ఆమె నా ప్రభువును ఎవరో యెత్తుకొని పోయిరి; ఆయనను ఎక్కడ ఉంచిరో నాకు తెలియలేదని చెప్పెను.

**8. పునరుత్థానుడైన క్రీస్తు తనని తాను కనబరచు కున్నది మొదట మగ్దలేనే మరియకే:**

**మార్కు 16:9** ఆదివారము తెల్లవారినప్పుడు యేసులేచి, తాను ఏడు దయ్యములను వెళ్లగొట్టిన మగ్దలేనే మరియకు మొదట కనబడెను.

9. **పునరుత్థానుడైన క్రీస్తు తనని తాను కనబరచు కున్నది మాత్రమే కాదు మొదటగా మాట్లాడింది కూడా మగ్దలేనే మరియతోనే:**

**యోహాను 20:15-16** యేసు అమ్మా, యెందుకు ఏడ్చుచున్నావు, ఎవనిని వెదకు చున్నావు? అని ఆమెను అడుగగా ఆమె తోటమాలి అనుకొని అయ్యా, నీవు ఆయనను మోసుకొని పోయినయెడల ఆయనను ఎక్కడ ఉంచితివో నాతో చెప్పుము, నేను ఆయనను ఎత్తుకొని పోదునని చెప్పెను.
16 యేసు ఆమెను చూచి మరియా అని పిలిచెను. ఆమె ఆయన వైపు తిరిగి ఆయనను హెబ్రీ భాషతో రబ్బూనీ అని పిలిచెను. ఆమాటకు బోధకుడని అర్థము.

10. **అపొస్తలులకు మరియు శిష్యులకు యేసు పునరుత్థానమును గూర్చి చెప్పింది:**

**లూకా 24: 10** ఈ సంగతులు అపొస్తలులతో చెప్పిన వారెవరనగా మగ్దలేనే మరియయు యోహన్నయు యాకోబు తల్లియైన మరియయు వారితో కూడ ఉన్న యితర స్త్రీలును.

**యోహాను 20: 18** మగ్దలేనే మరియ వచ్చి నేను ప్రభువును చూచితిని. ఆయన నాతో ఈ మాటలు చెప్పెనని శిష్యులకు తెలియ జేసెను.

**11. ప్రభువు పరిచర్యలో పాలిభాగం పొందింది:**

**లూకా 8: 1,2** వెంటనే ఆయన దేవుని రాజ్యసువార్తను తెలుపుచు, ప్రకటించుచు, ప్రతి పట్టణములోను, ప్రతి గ్రామములోను సంచారము చేయుచుండగా పండ్రెండు మంది శిష్యులును, అపవిత్రాత్మలును వ్యాధులును పోగొట్టబడిన కొందరు స్త్రీలును, అనగా ఏడు దయ్యములు వదిలి పోయిన మగ్దలేనే అనబడిన మరియయు, హేరోదు యొక్క గృహ నిర్వాహకుడగు కూజా భార్యయగు యోహన్నయు, సూసన్నయు ఆయనతో కూడా ఉండిరి.

**12. తమకు కలిగిన ఆస్తితో ప్రభువుకి ఉపచారము చేయుచూ వెంబడించిన వారిలో ఒకరిగా ఉంది:**

**లూకా 8: 3** వీరును ఇతరు లనేకులును, తమకు కలిగిన ఆస్తితో వారికి ఉపచారము ( అనేక ప్రాచీన ప్రతులలో- ఆయనకుపచారము అని పాఠాంతరము) చేయుచు వచ్చిరి.

**4 సువార్తలలో చెప్పబడిన క్రీస్తును వెంబడించిన మిగిలిన స్త్రీలు**

| ఎలా? / ఏ స్థలం? | పేరు | మత్తయి | మార్కు | లూకా | యోహాను |
|---|---|---|---|---|---|
| క్రీస్తుని వెంబడించి ఆయనకు ఉపచారము చేసిన వారు | మగ్దలేనే మరియ | మత్తయి 27:56 | మార్కు 15:40 | లూకా 8:2 | యోహాను 19:25 |
| | హేరోదు గృహ నిర్వాహకుడగు కూజా భార్యయగు యోహన్న | -- | -- | లూకా 8:2 | -- |
| | సూసన్న | -- | -- | లూకా 8:2 | -- |
| | అనేక మంది స్త్రీలు | -- | -- | లూకా 8:2 | -- |
| సిలువనొద్ద ఉన్న వారు | మగ్దలేనే మరియ | మత్తయి 27:56 | మార్కు 15:40 | -- | యోహాను 19:25 |
| | చిన్న యాకోబు యోసే అనువారి తల్లియైన మరియయు | మత్తయి 27:56 | మార్కు 15:40 | -- | -- |
| | సలోమే | -- | మార్కు 15:40 | -- | -- |
| | జెబదయి కుమారుల తల్లి | మత్తయి 27:56 | -- | -- | -- |
| | ఆయనకు నెళవైన వారందరును, | -- | -- | లూకా 23:49 | -- |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | గలిలయనుండి ఆయనను వెంబడించిన స్త్రీలు | | | | |
| | యేసు తల్లియైన మరియ | -- | -- | -- | యోహాను 19:25 |
| | యేసు తల్లి సహోదరియు | -- | -- | -- | యోహాను 19:25 |
| | క్లోపా భార్యయైన మరియ | -- | -- | -- | యోహాను 19:25 |
| ప్రభువు దేహము తో పాటుగా సమాధినొద్దకి వెళ్లిన వారు | మగ్దలేనే మరియ | మత్తయి 27:61 | మార్కు 15:47 | -- | -- |
| | వేరొక మరియ | మత్తయి 27:61 | -- | -- | -- |
| | యోసే తల్లియైన మరియ | -- | మార్కు 15:47 | -- | -- |
| | గలిలయనుండి ఆయనతో కూడ వచ్చిన స్త్రీలు | -- | -- | లూకా 23:55 | -- |
| ఆదివారము తెల్ల వారుతుండగా సమాధియొద్దకి వెళ్లిన వారు | మగ్దలేనే మరియ | మత్తయి 28:1 | మార్కు 16:1 | -- | యోహాను 20:1, 11 |
| | వేరొక మరియ | మత్తయి 28:1 | -- | -- | -- |
| | యాకోబు తల్లియైన మరియ | -- | మార్కు 16:1 | -- | -- |
| | సలోమే | -- | మార్కు 16:1 | -- | -- |
| | ఆ స్త్రీలు: 1. మగ్దలేనే మరియ 2. యోహన్న 3. యాకోబు తల్లియైన మరియ మరియు 4. వారితో కూడా ఉన్న స్త్రీలు | -- | -- | లూకా 24:1 & లూకా 24:10 | -- |
| పునరుత్థానము తరువాత మేడ గదిలో ఉన్న వారు | కొందరు స్త్రీలు మరియు యేసు తల్లియైన మరియ | అ. కా. 1:14 (మేడ గదిలో) వీరందరును, వారితో కూడా కొందరు స్త్రీలును, యేసు తల్లియైన మరియయు ఆయన సహోదరులును ఏక మనస్సుతో ఎడతెగక ప్రార్థన చేయుచుండిరి. | | | |

**ఈ స్త్రీల ద్వారా నేర్చుకో దగిన పాఠాలు:**

1. దేవుని కోసం ధైర్యముగా నిలబడాలి.
2. దేవునికి దగ్గరగా ఉండాలి.
3. దేవుడు మనలో జన్మించునట్లు మన హృదయాలను (గర్భాలను) సిద్ధపరచుకోవాలి.
4. ప్రభువు పొందిన శ్రమలకు సాక్షులుగా మిగలాలి.
5. పునరుత్థానుడైన క్రీస్తును చూచుటకు మొదట వరసలో ఉండాలి.
6. పునరుద్ధానుడైన క్రీస్తును ప్రకటించడానికి వేగిరపడాలి.
7. మన ఆస్తులు అమ్మి ప్రభువు పరిచర్యలో వాడాలి.
8. ఎల్లప్పుడు ప్రభువునకు దాసులుగా ఉండాలి.
9. ఆది వారము తెల్లవారుచుండాగానే ప్రభువును చూచుటకు బయలు దేరాలి.
10. ఎడతెగక ప్రార్థనలో ఉండాలి.

**అయితే క్రీస్తును ఎలా వెంబడించాలి?**

**తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతి దినము తన సిలువనెత్తుకొని వెంబడించాలి:**

**మత్తయి 16: 24** అప్పుడు యేసు తన శిష్యులను చూచి ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తన్ను తాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తుకొని నన్ను వెంబడింపవలెను. (మార్కు 08:34)

**లూకా 9:23** మరియు ఆయన అందరితో ఇట్లనెను. ఎవడైనను నన్ను వెంబడింప గోరిన యెడల, తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతి దినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను.

**క్రీస్తును వెంబడించాలి అంటే ఏం విడిచి పెట్టాలి?**

1. వలలను విడిచి పెట్టాలి. మత్తయి 4:20
2. దోనెను, తమ తండ్రిని విడిచి పెట్టాలి. మత్తయి 4:22. ఎందుకంటే
3. సమస్తమును విడిచి పెట్టాలి. లూకా 5: 11
4. నీకు కలిగినవన్నీ అమ్మి బీదలకు ఇవ్వాలి. లూకా 18:22

**క్రీస్తును వెంబడిస్తే లాభం ఏమిటి?**

1. మనల్ని ఆయన మనుష్యులను పట్టు జాలరులుగా చేస్తాడు. మత్తయి 4: 19
2. మనకు స్వస్థత వస్తుంది. మత్తయి 19 : 2
3. చీకటిలో నడవక జీవపు వెలుగు కలిగియుందురు. యోహాను 8:12
4. నిత్యజీవము స్వతంత్రించుకుంటాము. మత్తయి 19 : 29
5. ప్రభువు ఎక్కడ ఉండునో ప్రభువును వెబడించు వారు అక్కడే ఉందును. యోహాను 12: 26
6. దయ్యములను వెళ్లగొట్టుదురు. క్రొత్త భాషలు మాట్లాడుతారు. మార్కు 16:17
7. పాములను ఎత్తి పట్టుకొందురు, మరణకరమైనదేది త్రాగినను అది వారికి హాని చేయదు. రోగుల మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురు. మార్కు 16:18

**ఎవరు ప్రభువును వెంబడిస్తారు?**

1. దేవుని స్వరమెరిగిన వారు.

గొఱ్ఱెలు అతని స్వరమెరుగును. గనుక అవి అతనిని వెంబడించును. యోహాను 10: 4

2. దేవుని స్వరము విను వారు.

నా గొఱ్ఱెలు నా స్వరము వినును, నేను వాటి నెరుగుదును, అవి నన్ను వెంబడించును.

3. దేవుడు చేసిన అద్భుత క్రియలను చూచిన వారు. యోహాను 6: 2

అయితే ఎవరైతే దేవుని స్వరము వినరో, దేవుని వెలుగును వెంబడించరో, ఈ లోక ఆశలను విడిచి పెట్టరో, వారు త్రోవనుండి తప్పిపోయి సాతానును వెంబడించిన వారౌతారు. 1 తిమోతి 5:15... జాగ్రత్త!!!

క్రీస్తును ఎలా వెంబడించాలో క్రింది చిత్రములో ఇవ్వబడిన ఆ చిన్న పాప మనకు బోధిస్తుంది.

దేవునికి, దేవుని పనిలో మనము కూడా ఆలాగు వాడబడులాగున దేవుడు మనకు సహాయం చేయును గాక.



**ఆమేన్!!!**